# జీవుడి యిష్టము

–విశ్వనాథ సత్యనారాయణ

**పరిచయం :** చినవీరభద్రుడు

విశ్వనాథ సత్యనారాయణ గారి 'జీవుడి యిష్టము' దృక్పథవైశిత్యం కల్గిన గొప్ప రాజకీయ కథ అన్పించినందున 'ఆహ్వానం' పాఠకులకు ఏదన్నా కథ పరిచయం చెయ్యాలన్నప్పుడు ఈ కథ స్ఫురించింది.

ఒక భూప్రాంతంపైన మరొక భూప్రాంతం, ఒక జాతిపైన మరొకజాతి చేసే దురాక్రమణకూ, స్త్రీ యిష్టంపైన పురుషుడు చేసే నిర్బంధానికి పోలిక తీసుకురావడం ఒక్కటే కాదు, ఆ దురాక్రమణలోని అమానుషత్వాన్ని చాలా స్పష్టంగా చూపించడం, ఆ అమాను షత్వానికి దేశ, జాతి, లింగపర మయిన ప్రాతిపదికలన్నిటి రూపాల్లో ఒకే ఒక్క మౌలికాధారం ఉందని చూపించడం ఈ కథ విశిష్టత. కేవలం అమానుషత్వ నిరూపణ ఒక్కటే ఈ కథాసారాంశం కాదు. మనిషి తన జీవశక్తితో దాన్ని ప్రతిఘటిం చడం ఈ కథకి పతాక. ఆ విధంగా ఇది ఒట్టి రాజకీయ కథేకాక, మానవ విజయ గాథ కూడా అయింది.

పాశ్చాత్య రాజకీయ దర్శనం. దాని తాత్విక నేపథ్యమంతటితో కూడా ప్రధానంగా పురుషదృక్పథంలోంచి వృద్ధి చెందింది. పురుష - అంటే, ఇక్కడ బలం, పాశవిక స్థాయి నుండి మారణాయుధాల దాకా, వాటితో విజేతలయినవారి బలం, దోచుకున్నదాన్ని గెలుచుకున్న దానిగా చూపించే బలం ప్లేటో, మాకియవెల్లీ, మార్క్స్ - ఎవరయినా మౌలికంగా వారి దృక్పథాల్లోని పురుషత్వ ధోరణిలో ఏమీ తేడాలేదు. ప్లేటో భావుకుడూ, తత్త్వవేత్తా అయిన వాడే పాలకుడు కావాలని కోరుకుంటే, శ్రామికుడిగా నిజమయిన ప్రొలిటేరియన్ అయినవాడే పాలకుడు కావాలని మార్క్స్ కోరుకున్నాడు. కాని పాలిత-పాలక, విజిత-విజేత, అధమ-ఉన్నత వర్గాలుగా మనుషుల్ని విభజించే ఆర్థిక రాజకీయ శక్తుల్ని ప్రేరేపించే శారీరక-మానసిక శక్తుల గురించి వారు సరిగా నిదానించలేదేమో అనుకోవాలి. ఆ అజాగ్రత్త పర్యవసానం యూరప్ చరిత్ర అంతటా అడుగడుగునా మనకు కన్పిస్తూనే వుంటుంది.

యూరప్‌లో ప్రభవించిన, తద్వారా ప్రపంచంలో సంభవించిన గొప్ప సాంఘిక రాజకీయోద్యమాలు సహజీవనవాదాలు కాక సామ్రాజ్యవాదాలే కావడం యాదృచ్ఛికం కాదు. ఫ్రెంచ్ విప్లవం నుండి నెపోలియన్, అమెరికన్ విప్లవం నుండి అటంబాంబూ, సోవియెట్ విప్లవం నుండి స్టాలిన్, ఎల్సిన్‌లూ పుట్టుకు రావడం, ఆ చరిత్రలని నిశితంగా పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగించదు. వాటి చేతులు ఎంత మార్పుని కోరుకున్నా, ఆ హృదయాల్లో ఉన్నవి పాశవిక ఆధిపత్యధోరణే. ఈ ఆధిపత్య ప్రతిష్ఠాపనని, ఒక జాతి వర్గ లక్షణంగా కాక, ఒక ప్రధాన పురుషలక్షణంగా నేటి ఫెమినిస్టులు చూపిస్తున్నారు. కాగా విశ్వనాథ తన కథలో దీన్ని పురుషలక్షణంగా మటుకే చూపకుండా విదేశపురుష లక్షణంగా చూపించడం ఇక్కడ గమనించాలి. ఇక్కడ ఆస్త్రీ తనని బలాత్కరించే సైనిక నియంతకన్నా అతన్ని ఎదిరించి మరణించిన తన భర్తనే గొప్పవాడిగా చూపించింది. నిజమయిన పురుషుడు ఎలా వుండాలో ఆమె ఒక చిత్రణని తన భర్త ద్వారా చూపిం చిందనుకోవచ్చు. అంటే ఆధిపత్యం కావాలనుకోవడం పురుషులందరికి సామాన్యలక్షణం కాదు. పురుషులందు పాలకపురుషుల్ని వేరు చేసే విదేశలక్షణమేదో ఉంది ఇక్కడ. ఎవరు పురుషుల్లో అటువంటి విదేశీయులు (alienbeinst) అని ప్రశ్నిస్తే ఎవరికి జీవుడి ఇష్టము తెలియదో అటువంటి పురుషులు అని సమాధానం.

ప్రధానంగా ఇది జాతి ద్వేషానికి చెందిన కథ. పురుషద్వేషానికి చెందినది కాదు. 'నీ జాతి అంతా నశించిన తర్వాత నిన్ను ప్రేమిస్తాను' అని ఆమె నియంతతో అనడం గమనించదగ్గది. కాగా మానవ దుఃఖ నివారణకు ఒక దేశనిర్మూలనో, వర్గ నిర్మూలనో, జాతి నిర్మూలనో, లింగ నిర్మూలనో పరిష్కారమని ఎలా ఒప్పుకోగలం? విశ్వనాథ తన రక్తంలో ఇంకిపోయిన జాతి ద్వేషంతో తనకు తగ్గ కథే రాసాడు. అవివాద స్వదేశీవాదులయిన ఆఫ్రో-ఏషియన్ సాహిత్యవేత్తలెందరికో ఇటువంటి జాతిద్వేషం ఎంతో స్ఫూర్తినివ్వచ్చుగాక, కాని ఇది సరయిన మార్గమని చెప్పగలమా? మన విప్లవ సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం అధికభాగం రచనలు చదువుతుంటే ఆ రచనల్లోని వర్గద్వేషం, పురుషద్వేషం విశ్వనాథ జాతిద్వేషం వంటివే అన్పిస్తుంది.

కాని విశ్వనాథలోని సిద్ధాంతకారుని కన్నా ఆయనలోని రచయిత బలమయిన శిల్పి. (కనుకనే అనేక అభ్యుదయవాద రచయితలకన్నా ఆయన ఇంకా పాఠకులకి దగ్గరగా ఉన్నాడు.) ఈ కథలో స్త్రీ, ఆమె భర్త, సైనిక నియంత. ముగ్గురూ సజీవ మయిన పాత్రలు. ఆ కథ మరింత సజీవం. కాబట్టే, అన్ని రకాల ద్వేషాలనీ మించిన నిజమయిన ప్రతిఘటన ఏదో కూడా ఈ కథ ద్వారా విశ్వనాథ చూపించేడని పించింది. ఈ సందర్భంలోనే, ఇటువంటి కథలన్నిటికీ మకుటాయ మానంగా ఎల్లకాలాలకూ నిలిచే గురజాడ వారి 'కన్యక' కూడా గుర్తొస్తుంది.

మనిషి మనిషిపైన ఆధిపత్యం కోసం పాకులాడటం దేశవాచకం, జాతివాచకం, శక్తివాచకం, వర్గవాచకం, లింగవాచకం కూడా దీనికి ప్రతిఘటనగానే అన్ని రకాల ప్రాదేశిక, జాతీయ, సాంస్కృతిక, ఆర్థిక, స్త్రీ స్వాతంత్ర్యాల స్ఫురణ అంకురించింది. కాగా ఈ స్వాతంత్ర్య స్ఫురణ ఎప్పుడయితే ద్వేషంగా పరిణమిస్తుందో, అప్పుడది తన నైతిక బలాన్ని పోగొట్టుకుంటుంది. అదొక పోరాట స్థాయి నుంచి దొమ్మీగా దిగజారుతుంది. ఆధిపత్యానికి గురయి

అణచబడేవాడు కోరుకోవాల్సింది ఏమి? గురజాడ ఎంతో నిశితంగా ఈ సమస్యని పరిశీలించి ఉన్నాడు. కాని ఎక్కడా ద్వేషభరితమయిన పోరాటమే దానికి శరణ్యమని అనలేకపోయాడా. కడదాకా, నీ స్వాతంత్ర్య ప్రకటనే, ద్వేషరహితంగా, చివరి వూపిరి నిలిచిన దాకా, నీ స్వాతంత్ర్య ప్రకటనే - అదే నీకు ఆచరణీయ ధర్మం. ఎప్పుడయితే నీ స్వాతంత్ర్య ప్రకటన వ్యక్తి ద్వేషంగా పరిణమిస్తుందో అప్పుడు నిన్ను అణచేవాడికీ, నీకూ భేదం లేదు. అప్పుడు కూడా నువ్వు గెలుస్తానంటావా? జయాపజయాలు ఆయుధాలకు సంబంధించిన విషయాలు, మనుషులకు సంబంధించినవి కావు. ఈ కథలోని సైనికనియంత గెలిచినవాడని అనగలమా మనం? గురజాడ స్పష్టంగా చెప్పే ఉన్నాడు:

ఎక్కడయితే కన్య మానం
కాచుకొనుటకు మంటకలిసెనో
అక్కడొక సౌధమ్ము లేచెను
ఆకసము పొడుగై.

ఆ సౌధం మానవతా విజయ సౌధమేనని వేరే చెప్పాలా?

విశ్వనాథ తన కథలో గొప్ప జీవశక్తి ప్రతిష్ఠాపన చేసాడు. సామ్రాజ్యవాదానికీ, ఆధునిక విలాసవస్తు సంస్కృతికీ పురుషాధిపత్యానికీ అన్నిటికీ ఒక్కటే సమాధానం - ఆధిపత్యంతో పొందేవి చర్మాన్ని తప్ప, సంతోషాన్ని కాదు. మనం మన రచనల ద్వారా, చర్చల ద్వారా, అన్ని విధాల స్వాతంత్ర్య ప్రకటనల ద్వారా పాఠన, వర్తక, పురుష ప్రపంచానికి చెప్పవలసిందిదే- ద్వేషించికాదు. సహించి. కాని ఈ సహించడం అడుగడుగునా తీవ్రాతితీవ్రమయిన ప్రతిఘటనతో, ఇటువంటి ప్రతిఘటన మనిషిలోని పశుత్వాన్ని సంస్కరించగలదన్న నమ్మకంతో-

ప్రపంచవ్యాప్తంగా జాతిపరమయిన 'అణచివేత తగ్గడం మన కళ్ళముందే మనం చూసేం. ఆ మేరకి రాజకీయంగా స్త్రీ, పురుషులు విముక్తులయినట్లే. మనని మహాప్రబలంగా చుట్టుముట్టిన ఈ వ్యాపార పరమయిన అణచివేత కూడా ఏదో ఒకనాటికి నశిస్తుంది. అప్పుడు లభించేది ఆర్థిక స్వాతంత్ర్యం. చివరగా మనుషుల్లో లైంగిక-మానసిక ఆధిపత్య, అల్పత్వ వాసనలు కూడా క్షాళితం కాకపోవు. మనుషులకు మానసిక స్వాతంత్ర్యం సిద్ధించకపోదు.

ఆ ఎరుకతో మన ప్రయత్నాలు మనం చెయ్యాలన్నదే ద్వేషించవలసింది చెడ్డని తప్ప మనుషుల్ని కాదన్నదే మంచి రచయితలందరి నుంచీ మనకి తెలిసేది.

●

# ఎవరి యిష్టము

## విశ్వనాథ సత్యనారాయణ

ఒక మారుమూల సముద్రంలో ఒక ద్వీపం ఉంది. ఆ ద్వీపం కూడా యెక్కడో మారుమూల ఉంది. ఓడల మీద సముద్రాలను నాగరకులు గాలించారు. అంత గాలించిన ఆ ద్వీపం ఒక పట్టాన కనిపించలేదు. నాగరకులు సర్వ ప్రపంచము, సముద్రపు నీళ్ళలో తేలిన ప్రతి మంటిగడ్డ తాము సాధించామని అనుకొన్న తరువాత ఆ ద్వీపం ఉన్నదని తెలుసుకునేందుకే కొన్ని వేల యేండ్లు పట్టినవి. తెలుసుకోటమే ఆలస్యము. మతాలు, వర్తకులు, తుపాకులు అక్కడికి చేరినవి. ఆ ద్వీపంగూడా డిటో ప్రకారం అయింది.

అయితే ఆ ద్వీపంలో వాళ్ళు ఇతర ప్రపంచంలో లొంగిపోయిన యితర ద్వీప నివాసులకంటె కొన్ని వేల సంవత్సరాలు ఎక్కువ స్వాతంత్ర్యం అనుభవించారు. అందుచేత వాళ్ళు బానిసతనం అంత తేలికగా అలవాటు చేసికోలేక పోయినారు. ఇతర చోట్లకు మల్లేనే అక్కడా తిరుగుబాట్లు, మరఫిరంగులు, కాల్పులు.

ఒక నాగరికజాతి సేనా నాయకుడు ఆ ద్వీపానికి సైనిక నియంత. అతడు బ్రహ్మచారి. అనగా అవివాహితుడన్నమాట. ఆ ద్వీపము శీతమండలాల్లో ఉండటం మూలంగా అక్కడి జనులు తెల్లని వాళ్ళు. చర్మము తెల్లన. ఇతర ఖండములలోని అనాగరకుల వంటి వారు. అనగా కోట్లకొలది సంవత్సరాలు బ్రతికిన జాతి అన్నమాట. చెట్టులో - పుట్టలో, సూర్యునిలో - చంద్రునిలో, కాలువలో - కొండలో, మెరుపులో - మేఘములో నేదో దివ్య శక్తి యున్నదని దాని నారాధించిన వాళ్లు. మెరుమునుచూస్తే జేజేలు పెడతారు. మిణుగురు పురుగులనుచూచి తొలగిపోతారు. ప్రాణశక్తివంటిది వాళ్ళకు మహాగౌరవము. ప్రాణాన్ని నేలక్రింద పడవేసి రాయరు. జీవుణ్ణి కాలిక్రిందబెట్టి త్రొక్కరు. బంగారము నాణెముగా వాడుకోరు. దానియందు తేజశ్శక్తి ఉన్నదని ఆరాధిస్తారు. కుండ పెంకులలో వండుకొని తింటారు. లోహపాత్రలు నాగరికత అని యెరుగరు. శరీరావయవములు కావలసినంత మాత్రము కప్పుగొంటారు. నాగరకులై ఒళ్ళంతయు కప్పుకోరు. ఈ యనాగరకులు నాగరకులయ్యే రోజులు వచ్చి ఆ ద్వీపం నాగరకుల కంటబడ్డది.

సైనిక నియంత ఒక స్త్రీని చూచాడు. ఆమె అందం అతని కళ్ళు పట్టరాకండా ఉండిపోయింది. ఆ సాయంత్రం ఆవిడ మొగుడికి కబురు పంపించాడు - నీ భార్యని నాకు తోలిపెట్టమని. ఆ జీవుడు యేమి చేస్తాడూ? ఇంతవరకే తమ ద్వీపంలో జరిగిన ఘోరాలు అతనికి తెలుసు. అయినా జీవుడు పెనుగులాడడం స్వభావం. అది అన్యాయమనీ, తన ప్రాణము పోయినా తాను తన భార్యను వదలిపెట్టనని కబురంపించాడు.

నియంతకు కోపం వచ్చింది. పదిమంది సైనికులు, తుపాకులతో వాని యింటికి వెళ్ళాడు. అతడు వీళ్ళు వస్తారని తెలిసి పొయ్యిలో పెట్టుకొనే పొడుగాటి పుల్లలు తానొకటి, తన పెద్దకొడుకొకటి చేతులలో పుచ్చుకొని, తమ గుడిసె ముందర నిల్చున్నారు. వారి యాయుధాలను, వాళ్ళను చూస్తే నియంతకు నవ్వు వచ్చింది. అతడు "ఎందుకు నవ్వుతావు?" అని యడిగాడు. నియంత ఇట్లా అన్నాడు: "ఓరి మూర్ఖుడా: మా తుపాకులముందు నీ కట్టెపుల్లలు నిలుస్తవా?" అని. అతడన్నాడు కదా -"నా కట్టెపుల్లలు నీ తుపాకులకు సమాధానము చెప్పుతవని గాదు నేనీ కర్రలు పుచ్చుకొన్నది. నా మనస్సు నీ మనస్సుకు సమాధానం చెప్పవలెనని కాని మఱొక దానికి గాదు" అని.

నియంతకు కోపము వచ్చింది. ఒక్క కత్తి విసురుతో తండ్రి కొడుకుల తలలు తెగిపోయినవి. నియంత ఆ గుడిసెలో ప్రవేశించి అతని భార్యను తీసుకు రాబోయినాడు. ఆరేండ్ల మొదలు చనుబాలు త్రాగే శిశువు వరకు నలుగురు పిల్లలు గుడిసెలో ఏడవ మొదలుపెట్టారు. ఆ స్త్రీ తన పిల్లలను వదలి రాలేకపోయింది. భర్త శవం, కొడుకు శవం మీదబడి యేడవడం మొదలుపెట్టింది. సైనికులు శవాలను తీసికొని పోయారు. సముద్రంలో పారవేశారు. ఆమె యిక పిల్లలను పట్టుకొని యేడవటం మొదలు పెట్టింది. సైనికులు నియంత ఆజ్ఞతో పెద్ద పిల్లలను ముగ్గురినీ తల్లి చేతులలోంచి లాక్కుని పది పదకొండుసార్లు విదలించివేయగా వేయగా వాళ్ళు దెబ్బలుతగిలి. ఉస్సురని ప్రాణాలు కడవట్టి చనిపోయినారు. ఆ స్త్రీ పాలుత్రావు పిల్లతో నియంత యింటికి వెళ్ళింది.


ఈ కథ జరిగి అయిదేళ్ళయింది. పాలుత్రాగే పిల్లకు అయిదేండ్లు వచ్చినవి. ఆ స్త్రీ ఆ పిల్లతో కాలం పుచ్చుతోంది. ఒక రోజున నియంత వచ్చాడు.

నియంత- ఆ పిల్లకూడా పోతేగాని నీవు నాతో సరిగా ఉండవు.

స్త్రీ - నీకన్న కర్కోటకుడవు నీవే : నీవు మనుష్యుడవు కావు. ఈ పసిపిల్ల ప్రాణములుకూడా తీస్తావా.

నియంత- నిన్ను తీసుకువచ్చినప్పుడూ ఇది పసిపిల్ల. ఇప్పుడు పసిపిల్ల కాదే! దీని యీడుపిల్లలను అప్పుడు నీ దగ్గరనుండి లాగి వేయలేదా? అట్లాగే ఇప్పుడూనా.

ఆ స్త్రీకి అతనితో అయిదేండ్లున్న తరువాత అతని యే మాటకు ఎంత అర్థమో తెలిసినది. తనబిడ్డ తనకు



మిగులదని ఆమెకు తెలిసింది. ఆ పిల్లను తీసుకువెళ్ళి అతని చేతిలో పెట్టి "యిదిగో, పిల్లను చంపివేయి. ఈ పిల్ల ఉన్నన్నాళ్లు నేను దానిని వదలిపెట్టలేను" అన్నది. అతడు ఆ పిల్లను ఆమె యెదుటనే కత్తితో రెండుగానరికాడు. ఆమె యేడుస్తూ వెళ్లిపోయింది.

ఆమె కొన్ని రాత్రులు ఉరిపోసుకొందామనుకుంది. పోసికోలేదు. ఆమె కొన్ని రాత్రులు సముద్రములోబడి చద్దామనుకుంది. చావలేదు.

ఆమె కొన్ని రాత్రులు కిరసనాయిలు మీదపోసికొని నిప్పు ముట్టించుకుందామనుకుంది. ముట్టించుకోలేదు.

ఇల్లా యెన్నో అనుకుంది. ఏమీ చేయలేదు. తరువాత కొన్నాళ్లకు ఒక రాత్రి నియంత తప్పత్రాగి మదించిన కళ్లతో ఆమె వున్న గదిలోనికి వచ్చాడు. "తనకు దుఃఖానికి భేదములేదు" అన్నట్లుగా ఉన్న ఆమెను చూచాడు. ఇట్లా అన్నాడు :

"నీ మగడు, నీ పిల్లలుపోయి పదేళ్లయింది. నీ పసిపిల్లపోయి అయిదేళ్ళయింది.

స్త్రీ- నా ద్వీపపు స్వాతంత్ర్యంపోయి పాతికయేండ్లయింది.

నియంత-(వెటకారముగానవ్వి) ఇంకా యెన్నాళ్లీ దుఃఖం?


స్త్రీ- ఈ శరీరం వున్నన్నాళ్లు.

నియంత- నీకు ఏమి తక్కువగా ఉంది? పూర్వం కన్న మంచి దుస్తులు ధరిస్తున్నావు. పూర్వంకన్న మంచి ఇంట్లో నివసిస్తున్నావు. పూర్వంకన్న మంచి భోజనం చేస్తున్నావు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ జాతికన్నా నా జాతి గొప్పది. నీ భర్తకన్న నేను గొప్పవాడను.

స్త్రీ- నీవు నా భర్తకన్న గొప్పవాడవు కావు.

నియంత-(కోపముతో) కానా! ఎట్లు కానో చెప్పుము.

స్త్రీ- మీకు తుపాకులున్నవి. కత్తులున్నవి, అతనికి యేమీ లేవు. అయినా తన భార్యను, పిల్లలను రక్షించుకునేందుకు కర్రపుచ్చుకొని నిలబడ్డాడు. రక్షించలేనని తనకు తెలుసు. అయినా తన ధర్మం తాను చేశాడు. తాను చచ్చిన తరువాతగాని నిన్ను నా దగ్గరకు రానీయలేదు. నేను నిజముగా నీ భార్యనై ఉంటే నీకన్న బలవంతుడు నాకోసం వస్తే, నీవు పారిపోయేవాడవు. నీవు వట్టి పిరికిపందవు.




నియంత-(కోపముతో)నేను పిరికి పందనుకాదు.

స్త్రీ-నీవు పిరికిపందవని నా కానాడే తెలియును. నీవు ధైర్యస్థుడవైనచో నింకొక కర్రపుచ్చుకొని అతని నెదరించెడివాడవు. అంత మంది సైనికుల నేల తెత్తువు?

నియంత-(నవ్వి) అయినచో ఆ చచ్చు వెధవను నేను కర్ర పుచ్చుకొని యెదిరించలేకపోతిననియా నీ యుద్దేశ్యం?

స్త్రీ- అతను చచ్చిపోయినాడు. నీమాటకు రుజువు ఏమున్నది? ఇప్పుడు నీ ధైర్యాన్ని నీవు నాకు రుజువు పరచలేవు. నిజంగా నీవు ధైర్యస్థుడవే అయితే అప్పుడలా చేసి యుండవు.

నియంత-నాకు ధైర్యము లేకపోవుటకాదు. నీ కప్పుడీ తెలివిలేకపోయింది.

స్త్రీ-మా జాతిలో తెలివికి ధైర్యానికి యెక్కువ భేదంలేదు. న్యాయానికి తెలివికి యెక్కువ భేదం లేదు, మాకు న్యాయమే తెలివి. తెలివే ధైర్యం.

నియంత-మఱి యిటువంటివారితో, నాతో నీవు సంసారమెందుకు చేస్తున్నావు?

స్త్రీ- నేను నీతో సంసారము చేయుట లేదు.

నియంత- ఈ మాటలు వింటే యెవరైనా నిన్ను మూఢు రాలవను కొంటారు.

స్త్రీ- నేను వాళ్లని మూఢులను కుంటాను.

నియంత-అయితే నీకు నాతో ఉండటం యిష్టంలేదన్నమాట.

స్త్రీ- లేదని నీతో చెప్పుట యిది యెన్నిలక్షలోసారి.

నియంత-నీవు నన్ను ప్రేమించటం లేదని నాకు తెలుసు, నీ ప్రేమను నేను సాధుమార్గాన సంపాదించవలసింది. అప్పుడు ప్రేమించేదానవు.

స్త్రీ- నీజాతి అంతా నశించిన తరువాత నిన్ను ప్రేమిస్తాను.

నియంత- నిన్ను చంపేస్తాను.

స్త్రీ- పదియేళ్ళనుంచి అలా చేస్తావేమోనని యెదురు చూస్తున్నాను.

నియంత నీకు చావంటే అంత యిష్టమా?

స్త్రీ - అంతా యింతా యిష్టమా?

నియంత- అయితే చావడానికి మార్గాలు లేవా?

స్త్రీ- ఉన్నవి.

నియంత- అయితే ఎందుకు చావవు? సముద్రంలోపడి చావవచ్చు, ఉరిపోసికొని చావవచ్చు.

స్త్రీ- నా కట్లా చావడం యిష్టంలేదు.

నియంత- ఎట్లా చావడం యిష్టం?

స్త్రీ- నీకు కోపముతెప్పించి నువ్వు నన్ను చంపితే చావాలని.

నియంత- అంటే, నీకు నామీద ప్రేమ ఉన్నదన్నమాట

స్త్రీ- అవును, ఉంది. ఆ ప్రేమ యెల్లాంటిదంటే-నాభర్త, నా పిల్లలు నీ చేతిమీదుగా చచ్చారుగనుక అలా నీ చేతిమీదుగానే చద్దామన్నంతప్రేమ.

నియంత-ఈ మాటలకేమిగాని నీకు చావడానికిష్టంలేదు.

స్త్రీ- చాలాపొరపాటు. చావటానికిష్టం ఉన్నదీ. ఆ యిష్టము కూడా ఒళ్ళంతా తగలబెడుతూ ఉన్నంత యిష్టం. కాని చావు రెండు రకాలు, ఒకటి తనంతట తాను చచ్చేచావు. రెండవది యెదటివాళ్లు చంపితే చచ్చేచావు. నాకు రెండవ చావే యిష్టము.

నియంత-అంటే నాతోకలిసి సుఖించడం యిష్టమన్నమాట.

స్త్రీ- నిన్ను నేను పదేండ్లనుంచి యెరుగుదును. నీవు పశువువు. నీ నాగరికత అంతా నీవుచేసే సురాపానంలో, నీవు

ధరించే దుస్తుల్లో, నీ చేతిలోనున్న తుపాకీ మందులో ఉంది. నీమనసులోలేదు, నీ జాతిలో లేదు. నీ సృష్టిలోలేదు. నిన్ను నేను ప్రేమించటంలేదు; నీవు మనుష్యుడవే కాదు. నేను బ్రతుకు తున్నానన్న విషయం నీకాశ్చర్యంగా ఉంది. నేను ఉరిపోసికునో, సముద్రంలో పడో చావటం నా జీవుడికి యిష్టం లేదు. నా జీవుడు ఈ శరీరాన్ని పట్టుకున్నాడు. వాడంతతటవాడు వదలిపోడు. ఆ నా చనిపోయిన భర్తకోసం, పిల్లలకోసం గుండె అలవుటించి చావటం, మహాగ్ని జ్వాలలతో మ్రగ్గిపోవటం ఈ జీవుడికి యిష్టం. ఈ జీవుడికి యిదియొక అనుభవం. ఆ జీవుడు తనంతట తాను చచ్చిపోడు. చచ్చిపోవటానికి యిష్టపడడు, సౌఖ్య మనుభవిద్దామని కాదు. దుఃఖ మనుభవిద్దామని. సౌఖ్యమో దుఃఖమో యీ శరీరంతో పుట్టి, యీ శరీరానికి సంబంధించినవి అనుభవించటమే అతని కిష్టం. ఈ శరీరానికి, యీ జీవుడికి ఒక యెడతెగరానిలంకె. ఈ శరీరంతో ఈ జీవుడికి యిష్టమైన అనుభవము వాడు అనుభవమను కొంటాడు. మరి యీ శరీరంతో నేను నీతో సంసారము చేస్తున్నాను గనుక అది వాడి యిష్టమే అనుకుంటావు కాబోలు. అల్లాకాదు. నా అంతట నేను చావటం నా కిష్టంలేదు. నీవు చంపితే చచ్చిపోవటం చాలా యిష్టం. మృత్యువు దానియంతటి అదివస్తే చావటం యింకా యిష్టం. అట్లాగే ఈ జీవుడు ఈ శరీరంతో తన యిష్టంవచ్చిన సౌఖ్యాన్ని అనుభవించి సౌఖ్యం అనుభవించానను కుంటాడు. ఇతరులవల్ల బలవంతంగా చేయబడ్డ అనుభవం అదివాడికి సౌఖ్యం కాదు. అది దుఃఖమే. ఆ దుఃఖమైనా అనుభవించటం అతని కిష్టం.

నియంత-అయితే నీవు నాకక్కరలేదు.

స్త్రీ- నేను నిన్నడుగలేదు.

నియంత-నిన్ను చంపుతాను.

స్త్రీ- ఊరికే అనట మెందుకు?

నియంత ఆమెను చంపెను. చనిపోవుచున్న యామె పెదవి మీద సంతోషపు నవ్వు తాండవించెను. ఆమె కొన యూపిరితో నిట్లనెను. "నీవు నీ జన్మలో చేసిన మంచిపని యిది యొక్కటియే. నేను చనిపోవుచుంటినిగదా! నీవు తరువాత యేమిచేసెదవు?"

నియంత - మరల నింకొక స్త్రీని సంపాదించెదను.

స్త్రీ - నీకు తగినమాట! నీ జాతికి జీవుని యిష్టము తెలియదు.

